క్లుప్తంగా

వ్యర్థాలను రోడ్లపై పారబోస్తే చర్యలు



పల్లి వీధి రోడ్డుపై వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులోని పలు ప్రధాన ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లపై స్థానికులు కొందరు నిర్లక్ష్యంగా వ్యర్థాలను పారబోస్తూ పరిసరాల అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. వార్డు పర్యటనలో భాగంగా శుక్రవారం మల్కాపురం, పల్లి వీధి, గొల్ల వీధి, మార్కెట్ లైన్, కృష్ణ బార్ వెనుక మార్గాల్లో కార్పొరేటర్ కొణతాల సుధ పర్యటించారు. రోడ్లపై డంప్ చేసిన వ్యర్థాలను గుర్తించారు. మళ్లీ ఇలా చెత్తను నిర్లక్ష్యంగా రోడ్లపై పారబోస్తే కఠిన చర్యలు, జరిమానాలు తప్పవని పలువురిని ఆమె హెచ్చరించారు. అనంతరం వార్డు శానిటరీ సిబ్బంది సాయంతో వ్యర్థాల తొలగింపు చర్యలు చేపట్టారు.

దేవులపల్లి అమర్‌కు సాదర స్వాగతం



దేవులపల్లి అమర్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

గోపాలపట్నం: జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్‌కు విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది.రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం విశాఖ చేరుకున్న ఆయనకు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, సమాచారశాఖ ప్రాంతీయ సంయక్త సంచాలకులు మణిరామ్ స్వాగతం పలికారు. గోపాలపట్నం తహసీల్దార్ కొర్ర జయ, ఇన్‌చార్జి డీటీ రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), పి.శాంతి(టెక్నికల్) తెలిపారు. ఫ్యూజన్ టైల్స్, ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ ట్రెండ్స్, ఎక్స్‌ప్రెస్ బీస్, మార్షల్స్ పెట్‌జోన్, యంగ్ ఇండియా, మ్యాక్స్ ష్యాషన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 325 ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 260 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 54 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు చెప్పారు. వారికి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ముందుగా అభ్యర్థులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తోందన్నారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



వాహనాల తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ జి.డి.బాబు

మల్కాపురం: మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు.నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేర మల్కాపురం ప్రధాన సర్వీసు రోడ్డు వద్ద సీఐ జి. దేముడుబాబు ద్విచక్ర వాహనాలు,కార్లు ఇతర వాహనాల పత్రాలు పరిశీలించారు.పత్రాలు లేని వారిని,అనుమానితులను విచారించారు. ఆయన మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్‌లో స్టేషన్ పరిధి పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. అతి వేగంగా ప్రయాణిస్తున్న వారిని,పత్రాలు లేని వారిని విచారించడంతో పాటు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు.

సీఎం లక్ష్యం.. ఆరోగ్యాంధ్రప్రదేశ్



పేషెంట్లకు కేస్ షీట్లు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, కె.కె.రాజు



పదార్థాలను రుచి చూస్తున్న సమన్వయకర్తలు, అధికారులు

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన

కంచరపాలెం: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ జోన్–5 పశ్చిమ నియోజకవర్గ పరిధి కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జీవీఎంసీ అధికారులు, వైద్యాధికారుల సమక్షంలో వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథులు ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించి, ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సంక్షేమ పథకం ప్రజల ముంగిటకు చేరేలా సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలిస్తోందన్నారు. ఈ ఘనత సాధించిన రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించిందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి అత్యుత్తమ వైద్యం అందించడానికే ఈ కార్యక్రమాన్ని రూపొందించారని పేర్కొన్నారు. కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలంతా సద్వియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహారాల స్టాళ్లను సమన్వయకర్తలు పరిశీలించి ఆహార పదార్థాలను రుచి చూశారు.

1026 మందికి వైద్య పరీక్షలు

వైద్య శిబిరంలో 1026 మంది రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు చేసి కేస్ షీట్లు, ఉచితంగా మందులు అందజేశారు. ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్టు నేతృత్వంలో సుమారు 1,000 మందికి భోజనం అందజేశారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, జేఏఎస్ నోడల్ ఆఫీసర్ ఎం.తులసీ, 55వ వార్డు కార్పొరేటర్ కె.వి.ఎస్.శశికళ, 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజిని, వైఎస్సార్‌సీపీ 56వ వార్డు వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి, ఆర్పీపేట యూపీహెచ్‌సీ ప్రత్యేక వైద్యాధికారి ననపల రాజేంద్రకుమార్, ఇంజినీరింగ్ ఈఈ ప్రసన్నరెడ్డి, డీఈ ఏడుకొండలు, కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సీఐ ఎస్.సాయి, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పల్లా ఎర్నికుమార్, మహిళా నాయకురాలు సర్వసిద్ధి సాయిలత, కాయిత రత్నాకర్, దుప్పలపూడి శ్రీను, యర్రంశెట్టి శ్రీను, నమ్మి శ్రీను, దాసరి శామ్యూల్, యలమంచిలి రాజు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంపుపై దృష్టి

గాజువాక డిపో మేనేజర్ ప్రవీణ



మాట్లాడుతున్న డిపో మేనేజర్ ప్రవీణ

మల్కాపురం: ఆర్టీసీ ఆదాయం పెంచే విధంగా అంతా సమన్వయంతో పని చేయాలని గాజువాక ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ సూచించారు. టైర్ల పరిరక్షణ పక్షోత్సవాల సందర్భంగా డిపో గ్యారేజ్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బస్సులు నడిపే డ్రైవర్లు టైర్ల లైఫ్ వచ్చే విధంగా బాధ్యత తీసుకోవాలన్నారు. గతుకుల రోడ్డుపై నిదానంగా మంచి మార్గంపై వాహనం నడపాలని సూచించారు. టైర్లు జాగ్రత్తగా మెయింటెన్స్ చేసి పంచర్లు కాకుండా చూసుకోవాలన్నారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు,గ్యారేజీ సిబ్బంది,డిపో అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



సుప్ర వెహికల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్

సింహాచలం: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ సూచించారు. పెందుర్తి మండలం అక్కిరెడ్డి పాలెం , సరిపల్లి గ్రామాల్లో శుక్రవారం సుప్ర వెహికల్ ద్వారా ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగావాన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు ఏవిధంగా జరుగుతాయో సీసీ కెమెరాల ద్వారా రికార్డు అయిన పలు సంఘటనలను స్క్రీన్‌పై చూపించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ముఖ్యంగా డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ వినియోగించడం, మద్యం సేవించి వాహనం నడపడం, రోడ్డు క్రాస్ చేసేటప్పుడు నిర్లక్ష్యంగా ఉండటం విడనాడాలని పిలుపునిచ్చారు.

నేరాల నియంత్రణపై అవగాహన



మాట్లాడుతున్న పోలీస్ అధికారి

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలి న్యూహోల్‌సేల్ మార్కెట్ వద్ద నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ. రవిశంకర్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం సైబర్ నేరాల నియంత్రణపై ఆటో డ్రైవర్లు, వ్యాపారులు, కళాశీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సాయి ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, దొంగతనాలు, ట్రాఫిక్ నియంత్రణపై జోన్–1 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ అవగాహన కల్పించారు. దుకాణ సముదాయాలు, ఆటో స్టాండ్‌లు, అపార్ట్‌మెంట్లు, దేవాలయాలు, చర్చిలు సంఘాల భవనాలకు కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కంచరపాలెం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మళ్ల అప్పారావు మాట్లాడుతూ ప్రజలు, వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. బీఆర్‌టీఎస్ రహదారిలో ట్రాఫిక్ నియంత్రణకు భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

నగరంలో కార్డన్ సెర్చ్

సరైన ధ్రువపత్రాలు లేని 31 బైక్‌లు సీజ్



తనిఖీ చేస్తున్న పోలీసులు

దొండపర్తి : నేర నియంత్రణలో భాగంగా పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పీఎం పాలెం, టూటౌన్, మహారాణిపేట పోలీస్‌స్టేషన్ల పరిధి పలు ప్రాంతాలను జల్లెడ పట్టారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాలతో డీసీపీ–1 కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 150 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది గురువారం అర్ధరాత్రి, శుక్రవారం తెల్లవారు జామున మారికవలస, కొబ్బరితోట, సాలిపేట ప్రాంతాల్లో ఒకే సమయంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో సరైన ధ్రువపత్రాలు లేని 31 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

భాగ్యలక్ష్మికి ఘన సన్మానం



భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న డాక్టర్ హేమలత

మల్కాపురం: ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మల్కాపురం సెయింట్ మహిళ కళాశాలలో రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మిని ఘనంగా సత్కరించారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు హేమలత పాల్గొని భాగ్యలక్ష్మిని సన్మానించి జ్ఞాపిక అందజేశారు.డాక్టర్ హేమలత మాట్లాడుతూ రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలిగా ఉత్తమ బోధన అందించడంతో పాటు ఎన్ఎస్ఎస్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు భాగ్యలక్ష్మి చేస్తుండడం చాలా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో న్యాయవాది విశ్వనాథరాజు, చిత్రకారుడు సుంకర చలపతిరావు, కవి సత్తిరాజు,కార్మిక నాయకుడు సత్యానందం, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధాలయాల అభివృద్ధికి చేయూత అవసరం



బుద్ధిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, సభ్యులను సత్కరిస్తున్న బౌద్ధాలయ సభ్యులు

కంచరపాలెం: రాష్ట్రంలోని బౌద్ధాలయాల అభివృద్ధికి ప్రభుత్వం మరింత చేయూతనివ్వాలని భారత బుద్ధిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు కోరారు. కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి బుద్ధుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆంధ్ర బౌద్ధ సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ నేతృత్వంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన బౌద్ధ సొసైటీ సభ్యులను కేంద్ర సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ విశాఖలోని బౌద్ధ క్షేత్రాలను అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు. బౌద్ధ క్షేత్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు బౌద్ధ సమాజ సభ్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అశోక్‌నగర్ బౌద్ధాలయంలో సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు.

కార్యక్రమంలో వేణుగోపాల్ గౌతమ్, ఫ్రెడ్డీ, సూరిబాబు, సిహెచ్.బాబూరావు, బౌద్ధ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై మంటలు



లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభంపై చెలరేగుతున్న మంటలు

గోపాలపట్నం: విద్యుత్ స్తంభంపై మంటలు చెలరేగడంతో స్థానికంగా ఆందోళన రేకెత్తించింది. గోపాలపట్నం లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ ప్రధాన రహదారిలోని యోగితాప్రియ సప్లయర్ దుకాణం సమీపంలో శుక్రవారం వేకువ జామున 3 గంటల సమయంలో విద్యుత్ స్తంభంపై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది చూసిన కొందరు ఆందోళనకు గురయ్యారు. కొద్దిసేపటి వరకు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. పోలీసులు, ఫైర్ అధికారులకు సమాచారమందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న గోపాలపట్నం ఎస్‌ఐ అప్పలనాయుడు పరిస్థితిని సమీక్షించారు. ఆ తర్వాత ఘటనా స్థలానికి చేరుకున్న మర్రిపాలెం ఫైర్ అధికారులు ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. విద్యుత్ స్తంభానికి కేబుల్ తీగల కట్టలుగా కట్టి వదిలేశారు. దీంతో కట్టల్లో షార్ట్ సర్క్యూట్ అవడంతో మంటలు చెలరేగాయని పోలీసులు తెలిపారు. కాలిపోయిన కేబుల్ తీగలు కిందకి పడి పోవడంతో కొద్దిసేపటికి మంటలు అదుపులోకి వచ్చాయి. ఉదయం సమయంలో జరిగి ఉంటే స్థానికులు వాహన చోదకులు ప్రమాదానికి గురయ్యేవారని తెలియజేశారు.

ఎస్‌జీఎఫ్ షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలు నేడు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలను శనివారం నిర్వహించనున్నట్లు అనకాపల్లి ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. అండర్–14 బాలురు, బాలికల విభాగాల పోటీలు, ఎంపికలు పరవాడ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలోని ఇండోర్ స్టేడియంలో, అండర్ 17 బాలురు బాలికల పోటీలు, ఎంపికలు బోనంగిలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆవరణల్లో చేపట్టనున్నట్లు తెలిపారు.

10న యోగా పోటీలు

ఎస్‌జీఎఫ్ ఉమ్మడి విశాఖ స్థాయి యోగా పోటీలు, ఎంపికలు ఈ నెల 10వ తేదీన పరవాడ మండలం ధర్మారాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల కో–ఆర్డినేటర్ లోవరాజు తెలిపారు. బాలురు, బాలికలకు అండర్ 14, 17 విభాగాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల అనంతరం రాష్ట్ర పోటీల్లో పాల్గొనున్న జట్ల ఎంపిక చేపడతామని తెలియజేశారు.

రిమాండ్ ఖైదీ మృతిపై 12న విచారణ

మహారాణిపేట: రిమాండ్ ఖైదీ రొంపల్లి రామకృష్ణ మృతిపై ఈ నెల 12న ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేపడుతున్నట్లు భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. కొత్తవలసకు చెందిన రాంపల్లి రామకృష్ణ రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురి కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 13న ఆయన మృతి చెందాడు. దీనిపై మెజిస్టీరియల్ విచారణ చేపట్టాలని నిర్ణయించి.. భీమిలి ఆర్డీవోను విచారణాధికారిగా నియమించారు. ఈ నేపథ్యంలో భీమిలి ఆర్డీవో కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు విచారణ చేపడుతున్నామని.. రామకృష్ణ మరణం గురించి తెలిసిన వారు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలని ఆర్డీవో కోరారు.

వ్యాపార ప్రకటనలకు అనుమతులు తప్పనిసరి



గోడపై రాసిన వ్యాపార ప్రకటనపై సున్నం పూస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు వ్యక్తుల భవనాలపై అనుమతులు లేకుండా వ్యాపార ప్రకటనలు ఏర్పాటు చేయవద్దని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సూచించారు. 52వ వార్డులో శుక్రవారం పర్యటించిన ఆయన చాలా చోట్ల గోడలపై అనధికారంగా వ్యాపార సంస్థల ప్రకటనలను గుర్తించారు. ఇలాంటి వాటిపై కలుగుతున్న అసౌకర్యంపై కొంతమంది ఇంటి యజమానులు డిప్యూటీ మేయర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులకు సూచించినా.. వారు పట్టించుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, సంబంధిత విభాగం సిబ్బందితో కలిసి కాలనీల్లో పర్యటించారు. పలు చోట్ల గోడలపై ఉన్న వ్యాపార ప్రకటనలు తొలగించాలని సూచించారు. డిప్యూటీ మేయర్ స్వయంగా బ్రష్ పట్టుకొని గోడలపై ఉన్న వ్యాపార సంస్థల ప్రకటనలపై సున్నం పూశారు. వ్యాపార ప్రకటనలు గోడలపై రాయకుండా చూడాల్సిన బాధ్యత జీవీఎంసీ అధికారులపై ఉందన్నారు. ఇలాంటివి మరోమారు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

హిందీ భాష వ్యాప్తికి కృషి

ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్



పత్రిక ఆవిష్కరిస్తున్న ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

గోపాలపట్నం: హిందీ భాష వ్యాప్తికి కృషి చేయాలని ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ అన్నారు. హిందీ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజభాషగా ఉన్న హిందీని మరింత అభివృద్ధి చేసేందుకు ఎన్ఎస్టీఎల్ ఉద్యోగులు, విద్యార్థులు కృషి చేయాలన్నారు. 15 రోజులుగా హిందీ భాషపై వ్యాసరచన, కథా రచన, నోట్, డ్రాఫ్టింగ్, అనువాదం, పద్యపఠనం, వంటి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఎన్ఎస్టీఎల్ అంతర్గత మంథన్ 8వ ఎడిషన్‌ను విడుదల చేశారు. హిందీ, హిందీ భాషేతర విభాగాల్లో 150 మంది ఉద్యోగులకు పురస్కారాలు అందించారు. హిందీ పక్షోత్సవాల చైర్మన్, శాస్త్రవేత్త డాక్టర్ పీకే పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో హిందీ అధికారి వివేక్ శర్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.

రూ.12 లక్షల బంగారు ఆభరణాల చోరీ

- పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో ఘటన

పీఎంపాలెం: స్థానిక ఆర్‌హెచ్‌కాలనీలో చోరీ జరిగింది. సుమారు రూ.12 లక్షల విలువ గల ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పీఎంపాలెం క్రైం ఇన్‌చార్జి సీఐ రమేష్ తెలిపిన వివరాలివీ.. ఆర్‌హెచ్ కాలనీలోని ఇంటి నంబర్ 7–23లో కె.ధనుంజయరావు తన భార్య స్వర్ణలత, కుమార్తెలతో కలిసి నివసిస్తున్నారు. అతని భార్య తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో గత శుక్రవారం నగరంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అతను భార్యకు తోడుగా ఆస్పత్రిలోనే ఉన్నారు. కుమార్తెలు ఇంటిని కనిపెట్టుకుంటూ రాత్రి వేళల్లో సమీపంలోని బంధువుల ఇంటి వద్ద నిద్రపోతున్నారు. కాగా.. శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ధనుంజయరావు ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలిపారు. వెంటనే వారు వెళ్లి చూడగా.. బెడ్‌రూమ్‌లోని నగలు భద్రపరిచిన బీరువా తెరిచి ఉంది. గదిలో వస్తువులు, దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని బంగారు హారం, నక్లెస్, నాలుగు గాజులు, చెవి కమ్మలు, ఎత్తు గొలుసులు, ఉంగరాలు, స్టెప్ గొలుసు, కాళ్ల పట్టీలు తదితర రూ.12 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీకి గురయినట్లు గుర్తించారు. చోరీ అయిన వాటిలో బంధువుల ఆభరణాలు ఉన్నట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న ఏడీసీపీ నాగన్న, క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్‌ను రప్పించారు. కుటుంబ సభ్యులను విచారించారు. బాధితుడు ధనుంజయరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

వాల్తేర్ డివిజన్‌లో ముగిసిన హిందీ పక్షోత్సవాలు



కొటేషన్ కార్డులను ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తదితరులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రారంభమైన హిందీ పక్వాడా(పక్షోత్సవాలు) శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ అధ్యక్షతన ముగింపు వేడుకలు నిర్వహించారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో 15 రోజులుగా ఉద్యోగులకు హిందీ వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డివిజన్ పరిధిలో హిందీ భాషాభివృద్ధి కోసం పనిచేస్తున్న 30 మంది అధికారులు, 45 మంది ఉద్యోగులను ప్రశంసాపత్రాలతో డీఆర్‌ఎం సత్కరించారు. ప్రముఖ వ్యక్తుల సిద్ధాంతాలతో కూడిన కొటేషన్ కార్డులను ఆయన ఆవిష్కరించారు.

ఆక్రమణల తొలగింపు



పాత గోపాలపట్నం రహదారిలో ఆక్రమిత దుకాణాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు బాజీ జంక్షన్ నుంచి పాత గోపాలపట్నానికి వెళ్లే మార్గంలో రహదారిని ఆక్రమించి ఉన్న దుకాణాలను శుక్రవారం జీవీఎంసీ అధికారులు, పోలీసులు తొలగించారు. దుకాణాల దారులు రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో చర్యలు చేపట్టారు. బాజి జంక్షన్ నుంచి దిగువ వరకు ఉన్న ఆక్రమణలను తొలగించడంతో రహదారి కాస్తా వెడల్పుగా మారుతుందని సీఐ తెలిపారు. తిరిగి ఆక్రమణకు గురికాకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గోపాలపట్నం ఎస్‌ఐ అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

బాజీ జంక్షన్‌లో విజువల్ పోలీసింగ్



బాజీ జంక్షన్‌లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న సీఐ అశోక్‌కుమార్

గోపాలపట్నం: బాజీ జంక్షన్‌లో గోపాలపట్నం ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు శుక్రవారం విజువల్ పోలీసింగ్ నిర్వహించారు. ఇటీవల ఈ కూడలిలో సిగ్నలింగ్ వ్యవస్థ ప్రారంభమైంది. దీంతో ఇక్కడ మాన్యువల్‌గా ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ ప్రత్యక్షంగా పాల్గొని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. వాహనాల రాకపోకలు ఏవిధంగా సాగుతున్నాయో పర్యవేక్షించారు. లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐ అప్పలనాయుడు విజువల్ పోలీసింగ్ చేశారు. పాదచారులకు నేర నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గోపాలపట్నం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట వేస్తున్న మహిళలు

సింధియా: జీవీఎంసీ 63వ పరిధి కాంత్రినగర్‌లో క్రాంతి క్రేజీ బాయ్స్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మహిళలు అమ్మవారికి పూజ చేసి పందిరి రాట వేశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉత్సవాలు చేసుకోవాలని నిర్వా హకులకు మల్కా పురం సీఐ దేముడు బాబు సూచించారు. కార్యక్రమంలో క్రేజీబాయ్స్ యువత, మ హిళలు పాల్గొన్నారు.